తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట యాద్రాద్రి భువనగిరి
శనివారం
29 ఆగష్టు 2026
పేజీలు : 8
Follow :

## 22ఏ భూముల సమస్యలపై కలెక్టర్ కీలక ఆదేశాలు

❍ రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలి

❍ నిజమైన ప్రైవేట్ భూములకు న్యాయం.. ప్రభుత్వ భూముల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు



**ఖమ్మం, ఆగస్టు -28 ( జనంసాక్షి )**
22ఏ నిషేధిత భూముల సమస్యల పరిష్కారంలో అధికారులు పకడ్బందీగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు.

22ఏ జాబితాలో ఉన్న ప్రతి సర్వే నంబర్‌ను సంబంధిత రెవెన్యూ రికార్డులతో పూర్తి స్థాయిలో పరిశీలించి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా వివరాలను నిర్ధారించాలని ఆదేశించారు.

కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం 22ఏ భూముల సమస్యలపై అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ× రిజిస్ట్రేషన్ సమయంలో కొన్ని భూములు 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నట్లు గుర్తించబడుతున్నా యని తెలిపారు. 22ఏకు సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వస్తున్న ఫిర్యాదులను రెవెన్యూ అధికారులకు పంపిస్తున్నారని, వాటిపై సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలను క్రమం తప్పకుండా సమర్పించాలని సూచించారు.

22ఏ భూముల పరిశీలన, నమోదు, తొలగింపు ప్రక్రియకు జిల్లావ్యాప్తంగా ఒకే విధమైన సాధారణ ఫార్మాట్‌ను రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. నిషేధిత భూములను ప్రధానంగా ఐదు కేటగిరీలుగా గుర్తించాలని తెలిపారు.

**22ఏ నిషేధిత భూముల ఐదు కేటగిరీలు**
మొదటి కేటగిరీలో రాష్ట్ర, కేంద్ర చట్టాల పరిధిలోని నిషేధిత భూములు ఉంటాయని తెలిపారు. అసైన్‌మెంట్ భూములు, సీలింగ్ యాక్ట్, టెనెన్సీ యాక్ట్, ఆర్‌ఓఎఫ్‌ఆర్ తదితర చట్టాల పరిధిలోని భూములు ఉంటాయని వీటిలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రకాలు ఉంటాయని పేర్కొన్నారు.రెండవ కేటగిరీలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ భూములు, మూడవ కేటగిరీలో ఎండోమెంట్, వక్ఫ్ భూములు, నాలుగవ కేటగిరీలో సీలింగ్, అర్బన్ సీలింగ్‌కు సంబంధించిన భూములు, ఐదవ కేటగిరీలో ప్రభుత్వ ప్రయోజనాలను పరిరక్షించాల్సిన ఇతర భూములు ఉంటాయని తెలిపారు.

గతంలో రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలించకుండానే కొన్ని భూముల రిజిస్ట్రేషన్లు జరిగేవని, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలు సమన్వయంతో పనిచేయకపోవడం వల్ల సమస్యలు తలెత్తేవని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ చట్టానికి సవరణలు తీసుకువచ్చి నిషేధిత కేటగిరీలకు చెందిన భూముల రిజిస్ట్రేషన్లను నియంత్రించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం సర్వే, రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తున్నాయని కలెక్టర్ స్పష్టం చేశారు.

**ప్రజల్లో భయాందోళనలకు తావివ్వొద్దు:**
కొన్ని సందర్భాల్లో నిజమైన ప్రైవేట్ భూములు పొరపాటున 22ఏ నిషేధిత జాబితాలో చేరే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. అలాంటి నిజమైన కేసులను గుర్తించి నిబంధనల ప్రకారం వేగంగా పరిష్కరించాలని సూచించారు.

ప్రభుత్వ భూములను కాజేయాలనే స్వార్థ ప్రయోజనాలు కలిగిన వ్యక్తులు ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం లేదా అపోహలు వ్యాప్తి చేయడం ద్వారా తమకు అనుకూలంగా భూములను 22ఏ నుంచి తొలగించుకునే ప్రయత్నాలు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు.

**22ఏ నుంచి తొలగింపులకు ప్రత్యేక విధానం:**
ఏదైనా ప్రైవేట్ భూమి పొరపాటున 22ఏ నిషేధిత జాబితాలో నమోదైనట్లు నిర్ధారణ అయితే, దానిని తొలగించేందుకు సర్వే నంబర్ వారీగా డిలీటెడ్ లిస్ట్ రూపొందించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ తెలిపారు. 22ఏ జాబితాలో భూములను చేర్చే సమయంలో అనుసరించే విధానాన్నే

వార్తా లోపలి పేజీలో

## డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పనుల్లో
# వేగం పెంచాలి

ఏమైనా చిన్న చిన్న లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలి

కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**హుజూర్ నగర్ ఆగస్టు 28 (జనంసాక్షి):**
పట్టణ పరిధిలోని రామస్వామి గుట్ట వద్ద డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని , ఏమైనా చిన్న చిన్న లోపాలు ఉంటే వెంటనే రెక్టిఫై చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ఇండ్ల సముదాయాల్లో మిగిలిపోయిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రామస్వామిగుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీ ఇండ్లను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల మంత్రి ఆదేశాల మేరకు హౌసింగ్ యూనిట్లలోని ప్రతీ బ్లాక్‌ను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇండ్లలో ఉన్న చిన్న చిన్న లోపాలను గుర్తించి, ఆ లోపాలను వెంటనే సరిదిద్దాలని సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇండ్లతో పాటు డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పన పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఇండ్ల సముదాయం ప్రాంగణంలో మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవన పునాది పనులు, డైనింగ్ హాల్ నిర్మాణాలు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. వీటితో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, స్టామ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణ పనులకు ప్రాధాన్యతనిచ్చి పూర్తి చేయిస్తున్నట్లు వివరించారు. వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహసిల్దార్ కవిత మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నీట్ ( పీజీ ) పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ అమలు

పటిష్టమైన పోలీస్ బందోబస్తు, పోలీస్ పెట్రోలింగ్

పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం కార్పొరేషన్ ఆగస్టు 28 (జనంసాక్షి):** ఆగస్టు 30 వ తేదిన ఖమ్మం కమిషనరేట్ పరిధిలో నిర్వహించే నీట్( పీజీ ) -2026 పరీక్షల సందర్భంగా అయా పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 7:00 గంటల నుండి మధ్యాహ్నం 2:30 గంటల వరకు సెక్షన్ 163 ఃఔూ యాక్ట్ -2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో వుంటుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండరాదని సూచించారు. అదేవిధంగా ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఊరేగింపులు, దర్నలు, ప్రచారాలు నిర్వహించరాదని పెర్కొన్నారు. పరీక్ష సమయంలో

వార్తా లోపలి పేజీలో

## కలెక్టరేట్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

బాలికల రక్షణ, విద్య, సాధికారతకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి : కలెక్టర్ అంకిత్




**కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు 28 (జనంసాక్షి):**
రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్డ్రన్ హోమ్ బాలికలు జిల్లా కలెక్టర్ గారితో పాటు అదనపు కలెక్టర్ (రెవెన్యూ), అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్), జిల్లా సంక్షేమాధికారి కి మరియు ఇతర అధికారులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు బాలికలతో ఆప్యాయంగా ముచ్చటించి, వారి విద్య, భవిష్యత్ లక్ష్యాలు, అభిరుచుల గురించి తెలుసుకున్నారు. బాలికలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడంతో పాటు పుస్తకాలు, పెన్నులు, స్వీట్స్ తదితర బహుమతులను అందజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాలికలు కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజానికి, దేశానికి విలువైన సంపద అని అన్నారు. ప్రతి బాలికకు సురక్షితమైన వాతావరణం కల్పించడంతో పాటు, నాణ్యమైన విద్యను అందించి, వారు తమ కలలను సాకారం చేసుకునేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు."బేటీ బచావో ? బేటీ పడావో" స్ఫూర్తితో బాలికల రక్షణ, విద్య, ఆరోగ్యం, సాధికారతకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. బాలికలు ధైర్యంగా ముందుకు సాగి, ఉన్నత విద్యను అభ్యసించి, తమకు నచ్చిన రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

వార్తా లోపలి పేజీలో




## అక్రమంగా తరలిస్తున్న
# రేషన్ బియ్యం పట్టివేత

టాటా మ్యాజిక్‌లో 5 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

వ్యక్తిపై కేసు నమోదు

**బూర్గంపహాడ్ ఆగస్టు 28 (జనంసాక్షి)**
రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్న ఘటన బూర్గంపహాడ్ మండల పరిధిలోని నాగినేనిప్రోలు-రెడ్డిపాలెం గొమ్మూరు వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అశ్వాపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి రేషన్ బియ్యాన్ని కిలో రూ.17 చొప్పున కొనుగోలు చేసి

మిగతా 2లో

# సంత నిర్వాహకుల నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణమా?

- ప్రధాన రహదారిపై సంత.. ముందస్తు భద్రతా చర్యలు కరవు
- వాహనాల రాకపోకలు, జనసంచారం మధ్య తరచూ ప్రమాదాలు
- చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

**బూర్గంపహాడ్ ఆగస్టు 28 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం మోరంపల్లి బంజర గ్రామంలోని సంత ప్రధాన రహదారిపై కొనసాగుతుండగా, సంత నిర్వాహకులు తగిన భద్రతా చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం సంత వద్ద అంబులెన్స్?ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటన మరోసారి సంత నిర్వహణ తీరుపై ప్రశ్నలు లేవనెత్తింది. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



సంత జరిగే సమయంలో ప్రధాన రహదారిపై పెద్ద సంఖ్యలో ప్రజలు, వ్యాపారులు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారికి ఇరువైపులా వ్యాపారాలు ఏర్పాటు చేయడంతో పాటు వాహనాల పార్కింగ్ కూడా క్రమబద్ధంగా లేకపోవడం వల్ల రద్దీ పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటున్నారు.సంత నిర్వహించే సమయంలో రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి ఉన్నప్పటికీ, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ క్రమబద్ధీకరణ, ప్రజల భద్రత కోసం అవసరమైన ముందస్తు చర్యలు లేకపోవడం వల్లే ప్రమాదాల ముప్పు పెరుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా జరిగిన అంబులెన్స్?బైక్ ప్రమాదాన్ని అధికారులు తీవ్రంగా పరిగణించాలని స్థానికులు కోరుతున్నారు. సంత నిర్వాహకులు, గ్రామపంచాయతీ, పోలీసు శాఖ సమన్వయంతో సంత జరిగే రోజుల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని, రహదారిపై రద్దీని నియంత్రించాలని, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు చేపట్టడం కంటే.. ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు సూచిస్తున్నారు.

## అక్రమంగా తరలిస్తున్న
# రేషన్ బియ్యం పట్టివేత

టాటా మ్యాజిక్ వాహనంలో తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో బూర్గంపహాడ్ ఎస్ఐ మేడా ప్రసాద్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనంలో 10 బస్తాల్లో సుమారు 5 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి, టాటా మ్యాజిక్ వాహనంతో పాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మేడా ప్రసాద్ తెలిపారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**బాలికల రక్షణ, విద్య, సాధికారతకు**

**ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి : కలెక్టర్ అంకిత్**

"బాలికను కాపాడుదాం – బాలికను చదివిద్దాం – బాలిక ఎదుగుదలకు తోడ్పడదాం" అనే సందేశంతో సమాజంలోని ప్రతి ఒక్కరూ బాలికల భద్రత, విద్య, భవిష్యత్తు కోసం బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.రక్షాబంధన్ సందర్భంగా చిల్డ్రన్ హోమ్ బాలికలు అధికారులు, ప్రజాప్రతినిధులు, సమాజంలోని ప్రతి ఒక్కరి నుంచి తమకు అండగా ఉంటుందనే భరోసాను పొందారు. ఈ కార్యక్రమం బాలికల్లో ఆత్మవిశ్వాసం, భద్రతా భావం, కుటుంబ అనుబంధం పెంపొందించేలా ఆత్మీయ వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమం లో హబ్ మిషన్ కోఆర్డినేటర్ సంతోష్ రూప , స్వాతి , ప్రియాంక , మౌనిక , దీప్తి , చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వినోద్ మరియు బాలికలు పాల్గొన్నారు.

## అన్నాచెల్లెళ్ల అనుబంధానికి రాఖీ ముడి

**- ఆత్మీయంగా రాఖీ పౌర్ణమి వేడుకలు**

**- బూర్గంపహాడ్ మండలవ్యాప్తంగా పండుగ సందడి**

బూర్గంపహాడ్ ఆగస్టు 28 (జనంసాక్షి)



అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి వేడుకలు బూర్గంపహాడ్ మండలవ్యాప్తంగా శుక్రవారం ఘనంగా జరిగాయి. పారిశ్రామిక ప్రాంతమైన సారపాకతో పాటు బూర్గంపహాడ్, లక్ష్మీపురం, మోరంపల్లి బంజర్, టేకులచెరువు, అంజనాపురం, కోయగూడెం, తాళ్లగొమ్మూరు, ఇరవెండి, మోతే, పట్టీనగర్ తదితర గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది. ఈ సందర్భంగా అక్కాచెల్లెళ్లు తమ అన్నదమ్ములకు బొట్టు పెట్టి, అక్షింతలు వేసి రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆత్మీయంగా పలకరించుకోవడంతో పలు కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. తమకు ప్రేమగా రాఖీ కట్టిన అక్కాచెల్లెళ్లకు అన్నదమ్ములు కానుకలు అందించి వారి ఆశీర్వాదాలు పొందారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లో కుటుంబ సభ్యుల సందడితో పండుగ వాతావరణం నెలకొంది. అన్నాచెల్లెళ్ల అనుబంధం, పరస్పర ప్రేమను చాటే ఈ వేడుకలు మండలవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగాయి.

## అర్హులైన వారు
# ఆసరా పెన్షన్లకు దరఖాస్తు చేసుకోండి

**ఈనెల 30 ఆఖరు తేదీ ఎంపీడీవో వెల్లడి**

**కామేపల్లి,ఆగస్టు 28 (జనంసాక్షి):**



మండలంలో అర్హులైన లబ్ధిదారులు ఆసరా పెన్షన్లకు దరఖాస్తు చేసుకోవాలని ఈనెల 30వ తేదీలోగా పూర్తి చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో ) ధరావత్ సోమలాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.చివరి తేదీ దాటితే దరఖాస్తులు స్వీకరించబడవని ఆయన స్పష్టం చేశారు.అర్హులైన , వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత.గీత కార్మికులు సిక్కిల్ సెల్ వ్యాధులు ఇతర లబ్ధిదారులు తమ ఆధార్ కార్డ్, ఆదాయం.రేషన్ కార్డ్,బ్యాంక్ పాస్‌బుక్, వయస్సు ధృవీకరణ పత్రాలతో వెంటనే స్థానిక పంచాయతీ కార్యాలయం లో లేదా ఎంపీడీవో ఆఫీసులో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల లోపు సంప్రదించాలని కోరారు. దరఖాస్తుదారులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటనే ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు.

## వైఎస్ జగన్ దంపతుల 30వ వివాహ వార్షికోత్సవం..

**వృద్ధులకు అన్నదానం**



**భద్రాచలం ఆగస్టు 28 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వైఎస్ భారతి దంపతుల 30వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సారపాకకు చెందిన ఎడమకంటి దుర్గాప్రసాద్ రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్డులో ఉన్న సరోజినీ వృద్ధాశ్రమంలో 115 మంది వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వృద్ధులకు భోజనం అందించారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వైఎస్ భారతి దంపతులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని దుర్గాప్రసాద్ రెడ్డి ఆకాంక్షించారు. వివాహ వార్షికోత్సవాన్ని సేవా కార్యక్రమంతో జరుపుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. వృద్ధులకు అన్నదానం చేయడం అభినందనీయమని ఆశ్రమ నిర్వాహకులు పేర్కొంటూ జగన్ దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## బషీర్ బాగ్ స్ఫూర్తితో విద్యుత్ సవరణ

**- చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి..**

**- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్..**

**భద్రాచలం ఆగస్టు 28 (జనంసాక్షి)**



నాటి పాలకులు ప్రజలపై మోపిన విద్యుత్ భారానికి వ్యతిరేకంగా ఉద్యమించి అమరులైన సత్తెనపల్లి రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి ల స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన విద్యుత్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక చంద్రరావు భవనంలో సిపిఐ ఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గద్దం స్వామి అధ్యక్షతన జరిగిన బషీర్బాగ్ అమరవీరుల సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా బషీర్ బాగ్ అమరవీరుల చిత్రపటానికి సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఏజే రమేష్ మాట్లాడుతూ 2000 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వంతో కలిసి రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రజలపై మోపిన విద్యుత్ బారాలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో 100 రోజులపాటు సుదీర్ఘ పోరాటాన్ని నిర్వహించామని అన్నారు. వంద రోజుల పోరాటంలో వందలాదిమంది కార్యకర్తలపై పోలీస్ కేసులు నమోదయ్యాయని అనేకమంది కార్యకర్తలను లాఠీలతో విచక్షణారహితంగా దాడులు చేశారని అన్నారు. ఆగస్టు 28న జరిగిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నాటి ప్రభుత్వం అణిచివేయాలని కార్యకర్తలపై నాయకులపై ధమన కాండ చేసిందని గుర్తు చేశారు. లాఠీ దెబ్బలను పోలీసు తూటాలను ఎదిరించి విద్యుత్ ఛార్జీల పెంపుకు నిరసనగా పెద్ద ఎత్తున కార్యకర్తలు ముందుండి పోరాడారని ఆ పోరాటంలో సత్తెనపల్లి రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి ముగ్గురు అమరులయ్యారని అన్నారు. ఆ పోరాటంతో దిగివచ్చిన ప్రభుత్వం నాటి నుండి నేటి వరకు విద్యుత్ చార్జీలు పెంచాలంటే జంకుతుందని ఏజే రమేష్ అన్నారు. కేంద్రంలో మోదీ అధికారం చేపట్టిన నాటి నుండి అధాని, అంబానీలకు లాభం చేకూర్చే విధంగా విద్యుత్ సవరణ చట్టాన్ని అమలు చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని అన్నారు. మోదీ తీసుకొస్తున్న నూతన విద్యుత్ సవరణ చట్టంతో కార్పొరేట్ కంపెనీలకు సాధారణ నిరుపేద కుటుంబానికి ఒకే రీతిలో విద్యుత్ భారం పడుతుందని ఏజే రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కారం పుల్లయ్య, బండారు శరత్‌బాబు, సున్నం గంగ, ఎరంశెట్టి వెంకట రామారావు, పొరెల్లి సంతోష్‌కుమార్, బీజీజీ తిలక్, నకిరికంటి నాగరాజు, రవీంద్ర పాల్గొన్నారు.



**రాఖీ పౌర్ణమి సందర్భంగా ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి రాఖీ కడుతున్న సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది**

## అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి



**సూర్యాపేట (జనంసాక్షి):** సంతోషి మాత అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని శ్రీసంతోషిమాత దేవాలయంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి పర్వదినం ప్రజలందరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని ఆకాంక్షించారు. అమ్మవారి కృపతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవడంతో పాటు సోదరభావం, మానవతా విలువలను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్ వెలుగు వెంకన్న, ధరావత్ వెంకన్న, అరవింద్ రెడ్డి, వల్దాస్ దేవేందర్, మెగ్య తండ సర్పంచ్ భూక్య రాజు నాయక్, తండు శ్రీను, యాట ఉపేందర్, శ్రీకాంత్, ధర్మ నాయక్, రాజు, దేవాలయ గౌరవ అధ్యక్షులు నూక వెంకటేశం గుప్త, అధ్యక్షులు బ్రాహ్మండ్లపల్లి మురళీధర్, ప్రధాన కార్యదర్శి పబ్బా ప్రకాశరావు, కోశాధికారి కొత్త మల్లికార్జున్, నరేంద్రుని విద్యాసాగర్ రావు, సోమ శ్రీశైలం, బెలిదె అశోక్, తాళ్లపల్లి రామయ్య, బాల చంద్రుడు, ముదిరెడ్డి లింగారెడ్డి, బ్రాహ్మణపల్లి శివప్రసాద్, దేవరశెట్టి సోమయ్య, వందనపు వెంకటేశ్వర్లు, నూకా రవి, శంకర్, దేవాలయ అర్చకులు బట్టారం వంశీకృష్ణ శర్మ, అశోక్ మిత్రా తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి వెంకట్ రెడ్డి కి రాఖీ కడుతున్న రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ బోయినపల్లి రేఖ



**జాజిరెడ్డిగూడెం మండల ఆగస్టు 28 (జనంసాక్షి):** హైదరాబాదులో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, నవీన్ యాదవ్ లతో పాటు నలుగురు ప్రముఖులకు ఆడివెముల గ్రామానికి చెందిన మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, రేఖ చారిటబుల్ ఫౌండేషన్ చైర్ పర్సన్ డాక్టర్ బోయినపల్లి రేఖ రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## జాతీయ రహదారిపై వాహనాలు నిలిపితే కఠిన చర్యలు

**జాజిరెడ్డిగూడెం మండల ఆగస్టు 28 (జనంసాక్షి):** జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని నకిరేకల్-తానంచర్ల, జనగామ-సూర్యాపేట రెండు ప్రధాన జాతీయ రహదారులపై వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై పి. మధు హెచ్చరించారు. అర్వపల్లి పోలీస్ స్టేషన్లో శుక్రవారం మాట్లాడుతూ హైవే రోడ్లపై వాహనదారులు రోడ్లపై వాహనాలను నిలపవద్దని కోరారు. రాత్రి వేళల్లో వాహనాలను రోడ్డు పక్కన నిలిపితే ప్రమాదాలు జరుగుతాయని చెప్పారు. తమ వాహనాలకు నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే వాహనాలు నిలవాలని అన్నారు.



## అరకొర వసతుల మధ్య ఆదర్శ పాఠశాల వసతి గృహం.?

**౦కాంపౌండ్ వాల్ కూలి విద్యార్థినులకు భద్రత కరువు..**

**౦హాస్టల్పై ఆసక్తి చూపని విద్యార్థినులు..?**

**పి.ఏ.పల్లి,ఆగస్టు 28 (జనంసాక్షి):** నల్లగొండ జిల్లా పి.ఏ.పల్లి మండలం దుగ్యాల ఆదర్శ పాఠశాల వసతి గృహం అరకొర వసతుల నడుమ కొనసాగుతోంది. పాఠశాల, వసతి గృహం చుట్టూ ఉన్న కాంపౌండ్ వాల్ కొంతకాలంగా కూలిపోయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంపౌండ్ వాల్ లేకపోవడంతో హాస్టల్ ఆవరణకు రక్షణ లేకుండా పోయిందని, విద్యార్థినుల భద్రతపై భయాందోళనలు నెలకొన్నాయని వారు పేర్కొంటున్నారు. విద్యార్థినులకు సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన వసతి గృహంలోనే రక్షణ గోడలు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. రాత్రి వేళల్లో హాస్టల్ పరిసరాల్లోకి అన్య వ్యక్తులు, పశువులు ప్రవేశించే అవకాశం ఉందని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దీంతో తమ పిల్లలను హాస్టల్లో ఉంచేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఇప్పటికే హాస్టల్లో వసతుల కొరత, కాంపౌండ్ వాల్ సమస్య మరింత ఆందోళన కలిగిస్తోంది. విద్యార్థినుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కూలిపోయిన కాంపౌండ్ వాల్ను వెంటనే పునర్నిర్మించాలని తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి హాస్టల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, విద్యార్థినులకు పూర్తి స్థాయి భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



రక్షాబంధన్ సందర్భంగా శుక్రవారం మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డికి రాఖీ కట్టి ఆశీర్వదించిన ఆయన సోదరి కట్టా రేణుక శేఖర్ రెడ్డి

## రోడ్డుపై గుంతలను పూడ్చిన ఆటో యూనియన్ సభ్యులు



**రామన్నపేట, ఆగస్టు 28 (జనంసాక్షి):** రామన్నపేట మండల కేంద్రం నుంచి అమ్మనబోలు వెళ్లే రహదారిపై గుంతలు ఏర్పడడంతో శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రమదానం నిర్వహించి గుంతలను పూడ్చారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ.. అధికారులు పట్టించుకోక పోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి అని పేర్కొన్నారు. నిత్యం ఈ రహదారిలో వందల వాహనాలు తిరుగుతాయని అన్నారు. ప్రయాణం సాఫీగా సాగేందుకు రహదారి బాగుండాలని, గుంతల్లో మట్టి పోసి తాత్కాలికంగా పూడ్చామని తెలిపారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మత్తులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు తుర్కపల్లి ఉప్పలయ్య, మేకల రాములు, కప్పుల రమేష్, గంటెపాక బిక్షం, లక్ష్మయ్య చారి, ఎండి మజ్జు, బొంగు బిక్షం తదితరులు పాల్గొన్నారు.

## రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే బాలు నాయక్



**కొండమల్లేపల్లి, ఆగస్టు 28 (జనంసాక్షి):** పవిత్రమైన రాఖీ పౌర్ణమి రక్షాబంధన్ సందర్భంగా దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ఆత్మీయత, ప్రేమ, అనురాగం, ఆప్యాయత, పరస్పర నమ్మకానికి ప్రతీకగా జరుపుకునే పవిత్రమైన పండుగ అని అన్నారు. సోదరి తన సోదరుడి చేతికి రాఖీ కట్టి, అతని సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలను కోరుకోవడం, సోదరుడు తన సోదరికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇవ్వడం ఈ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. రాఖీ అనేది కేవలం ఒక దారపు ముడి కాదని సోదరసోదరీమణుల మధ్య జీవితాంతం కొనసాగే అనుబంధం, బాధ్యత, ప్రేమకు ప్రతీక అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చిన్ననాటి జ్ఞాపకాల నుంచి జీవితంలోని ప్రతి అడుగులో అక్కాచెల్లెళ్లకు, అన్నదమ్ములకు ఒకరికొకరు తోడుగా నిలిచే బంధమే రాఖీ పండుగ స్ఫూర్తి అని అన్నారు. సోదరులు తమ అక్కాచెల్లెళ్లను గౌరవిస్తూ వారికి అన్ని విధాలుగా అండగా నిలవాలని సోదరీమణులు తమ సోదరుల అభివృద్ధి, ఆయురారోగ్యాల కోసం ఆకాంక్షించాలని కోరారు. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే ఇలాంటి పండుగలు ప్రేమ, ఐక్యత, మానవీయ విలువలను పెంపొందిస్తాయని అన్నారు. రాఖీ పౌర్ణమి ప్రతి కుటుంబంలో ఆనందం, ఆత్మీయత, సంతోషాలను నింపాలని, అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధం ఎల్లప్పుడూ చిరస్థాయిగా ఉండాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఆకాంక్షించారు.

## అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ



**మునగాల, ఆగస్టు 28 (జనంసాక్షి):** అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలకు రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందని మునగాల మండల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎస్కే దస్తగిరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తన నివాసంలో రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కుమార్తెలు మహీరా ముభాషిర్, హనీఫా తమ సోదరుడు మాహిర్ కు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ.. రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ల మధ్య ఆత్మీయత, అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. ముస్లిం కుటుంబంలో రాఖీ పండుగను నిర్వహించడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ వేడుకను పలువురు ఆసక్తిగా తిలకించారు. అదేవిధంగా మునగాల మండలంలోని అన్ని గ్రామాల్లో రాఖీ పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించారు.

## మొక్కల సంరక్షణ సామాజిక బాధ్యత

**జాజిరెడ్డిగూడెం మండల ఆగస్టు 28 (జనంసాక్షి):** మొక్కల సంరక్షణ సామాజిక బాధ్యత అని కొమ్మాల సర్పంచ్ కుంటిగొర్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలను నాటి పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె శ్రీను, ఫీల్డ్ అసిస్టెంట్ శైలజ, గ్రామస్తులు పాల్గొన్నారు.



జనంసాక్షి

# నిబంధనలకు విరుద్ధంగా కోళ్ల ఫారం

- ○ జడ్చర్ల - కోదాడ రహదారిపై గ్రామస్తుల రాస్తారోకో
- ○ చింతపల్లిలో 'కోళ్ల ఫారం' మంటలు.. రోడ్డెక్కిన గ్రామస్తులు, నిలిచిన రాకపోకలు





**పెద్దవూర ఆగస్టు 28 (జనంసాక్షి):** నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం చింతపల్లి గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న కోళ్ల ఫారం నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ చింతపల్లి మరియు చింతపల్లి తండా గ్రామస్తులు జడ్చర్ల – కోదాడ ప్రధాన రహదారిపై బైఠాయించి తీవ్రస్థాయిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ దాదాపు 50 వేల కోళ్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ భారీ కోళ్ల ఫారానికి సంబంధించి ఎటువంటి అనుమతులు తీసుకోలేదని ఆరోపించారు. సాధారణంగా ఇలాంటి నిర్మాణాలు చేపట్టే ముందు ప్రజా భిప్రాయ సేకరణ తో పాటు పంచాయతీ, పశుసంవర్ధక శాఖ, , కాలుష్య నియంత్రణ మండలినుండి ముందస్తు అనుమతులు పొందాల్సి ఉన్నప్పటికీ, అవేవీ పట్టించుకోకుండా యజమానులు దౌర్జన్యంగా పనులు కొనసాగిస్తున్నారని మండిపడ్డారు.

**ఆరోగ్య సమస్యలపై ఆందోళన:**
గ్రామానికి అత్యంత సమీపంలో ఈ ఫారం ఏర్పాటు చేయడం వల్ల తీవ్ర దుర్వాసన, ఈగలు, దోమల ఉపద్రవం పెరిగి ప్రజారోగ్యం క్షీణించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో వ్యర్థాల నిర్వహణ సమస్యగా మారి ఊపిరితిత్తులు, ఇతర అంటువ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని తెలిపారు.

**అధికారులకు వినతి - హెచ్చరిక:**
వెంటనే సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన ఈ కోళ్ల ఫారం పనులను శాశ్వతంగా నిలిపివేయాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందించి నిర్మాణాన్ని తక్షణమే విరమించుకోకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

# స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్ శ్రీనగర్‌లో రాఖీ వేడుకలు



**ఖమ్మం, (జనంసాక్షి) :** స్థానిక శ్రీనగర్ కాలనీలో గల స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్ స్కూల్‌లో "రాఖీ పూర్ణిమ" వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్ స్కూల్ శ్రీనగర్‌లో రక్షాబంధన్ వేడుకలలో విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలను కట్టి వారందరు వారి లక్ష్యాలను, విజయాలను సాధించాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్ రావు మాట్లాడుతూ తరతరాలుగా వస్తున్న భారతీయ సాంప్రదాయంలోని రాఖీ పండుగ విశిష్టతను తెలియజేస్తూ రాఖీ(రక్షా) అనగా రక్షణ, బంధన్ అనగా సూత్రం అని అక్కా, చెల్లెలు తమ సోదరులు చేసే ప్రతి మంచి పనిలో విజయాలను సాధించాలని నుదుటన తిలకం దిద్ది చేతికి రక్షాబంధన్ కట్టి హారతి ఇచ్చి, ఆశీర్వాదం తీసుకుంటారని సోదరులు తమ అక్కా, చెల్లెలకు ఎల్లప్పుడు మీకు నేను రక్షణగా ఉంటానని ఆశీర్వదించి, మంచి బహుమతులను అందజేస్తారని స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్ స్కూల్ శ్రీనగర్‌లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మన సంస్కృతి సంప్రదాయాలను వారి జీవితంలో ఒక భాగంగా పెంపొందిస్తామని తెలి యజేస్తూ అందరికి రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలియజేసారు. రాఖీ పండగను పురస్కరించుకొని విద్యార్థినులందరూ రాఖీలను తెచ్చి సోదర సమానులైన తమ స్నేహితులకు రాఖీలను కట్టి తమకు రక్షణగా ఉండాలని ఆకాంక్షిస్తూ వారు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఎంతో ఉత్సాహంగా కేరింతలతో గురువుల మధ్యన ఈ రాఖీ వేడుకలలో పాల్గొని అందరిని ఆనందింప జేసి రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొండా కృష్ణవేణి, ప్రిన్సిపాల్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేసారు.





## రాఖీ పౌర్ణమి వేడుకల్లో వెల్లివిరిసిన

# అన్నాచెల్లెళ్ల అనుబంధం

- ○రాఖీలు కట్టి.. ఆప్యాయతలు పంచుకుని.. బహుమతులు అందజేసిన సోదరీమణులు
- ○పండుగ శోభతో కళకళలాడిన గ్రామాలు.. సందడిగా మారిన మార్కెట్లు

**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 28 (జనంసాక్షి)**
రాఖీ పౌర్ణమి సందర్భంగా అన్నపురెడ్డిపల్లి మండల వ్యాప్తంగా శుక్రవారం పండుగ వాతావరణం నెలకొంది. మండలంలోని గ్రామాలు, కాలనీలు, పట్టణ ప్రాంతాల్లో సోదరీమణులు తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అన్నదమ్ములు సైతం తమ సోదరీమణులకు బహుమతులు అందజేసి, జీవితాంతం వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.రాఖీ పండుగను పురస్కరించుకుని ఉదయం నుంచే ఇళ్లలో సందడి నెలకొంది. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. సోదరీమణులు ప్రత్యేకంగా రాఖీలు, మిఠాయిలు తీసుకువచ్చి అన్నదమ్ములకు రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించారు. దీంతో కుటుంబాల్లో ఆప్యాయత, ఆనందం వెల్లివిరిసింది.పండుగ నేపథ్యంలో మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని మార్కెట్లు రాఖీలు, మిఠాయిల విక్రయాలతో సందడిగా మారాయి. వివిధ రకాల రంగురంగుల రాఖీలు కొనుగోలు చేసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో దుకాణాలకు తరలివచ్చారు. మిఠాయి దుకాణాల్లోనూ కొనుగోళ్లు జోరుగా సాగాయి.ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, సామాజిక వేత్తలు ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానుబంధాలు మరింత బలపడాలని ఆకాంక్షించారు. రాఖీ పండుగ కుటుంబ బంధాలకు ప్రతీకగా నిలుస్తూ సమాజంలో ఐక్యత, ఆప్యాయతలను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకోవడంతో ఎటుచూసినా రాఖీ పౌర్ణమి శోభ కనిపించింది.

# పెద్దమ్మ గుడిలో ఘనంగా చండీ హోమం"



**కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు28 (జనంసాక్షి):** శ్రావణి పౌర్ణమిని పురస్కరించుకొని దేవస్థాన కార్యనిర్వాహణాధికారి యస్ రజనీకుమారి ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కేశవాపురం-జగన్నాధపురం లో వెలసిన శ్రీ కనకదుర్గా (పెద్దమ్మ తల్లి ) దేవస్థానంలో శుక్రవారం ఆలయ ఆవరణలో గల యాగశాలలో చండీహోమంను ఘనంగా నిర్వహించారు.ముందుగా మేళతాళాలతో,వేద మంత్రాలతో అమ్మ వారి ఉత్సవ విగ్రహాన్ని దేవాలయం నుండి యాగశాలకు తీసుకవచ్చి మండపారాధన, గణపతి పూజలు జరిపిన అనంతరం చండీహోమం, చివరిన పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు.ఈ హోమంలో 17 మంది దంపతులు ఒక్కొక్కరు రూపాయలు 2,516/- రుసుము చెల్లించి చండీహోమంలో పాల్గొన్నారు.హోమం అనంతరం అర్చకులు,వేద పండితులు హోమంలో పాల్గొన్న భక్తులకు ఆశీర్వచనంతో పాట అమ్మ వారి శేష వస్త్రం, ప్రసాదమును అఃదచేసారు.చండీహోమంలో పాల్గొ?న్న భక్తులకు అన్న ప్రసాద వితరణను గావించారు. ఈ కార్యక్రమం లో సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

**పెద్దమ్మ తల్లికి ఘనంగా పంచామ్రుతాభిషేకం**
శ్రీ పెద్దమ తల్లికి పంచామ్రుతములతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. ముందుగా మేళతాళాలతో దేవస్థాన అర్చకులు, భక్తులు జన్మస్థలం వద్ద వున్న అమ్మ వారికి పంచామ్రుతములు, పసుపు, కుంకుమ, గాజులు,హారతి సమర్పించిన అనంతరం దేవాలయంలోని అమ్మ వారి మూల విరాట్ కు పంచామ్రుతాలతో అభిషేకం అనంతరం పంచ హారతులు,నివేదన,నీరాజన మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.





# తాజుద్దీన్ కుటుంబాన్ని పరామర్శించిన నామ

**ఖమ్మం కార్పొరేషన్ ఆగస్టు 28( జనంసాక్షి)**
బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా మైనార్టీ మాజీ అధ్యక్షులు, ఆత్మీయ నాయకులు మహమ్మద్ తాజుద్దీన్ కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు శుక్రవారం పరామర్శించారుతాజుద్దీన్ కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. తాజుద్దీన్ మృతి ఎలా సంభవించిందనే వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు తాను ఢిల్లీలో ఉండటం వల్ల తాజుద్దీన్ ని కడసారి చూడలేకపోయానని నామ నాగేశ్వరరావు బాధను వ్యక్తం చేశారు. తాజుద్దీన్ తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడిన నామ నాగేశ్వరరావు పిల్లల చదువుల గురించి ఆరా తీశారు. తాజుద్దీన్ కుమారుడు హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ చదువుతున్న విషయం తెలుసుకుని, అతని చదువులు పూర్తయ్యే వరకు, అవసరమైన సహకారం అందిస్తానని, ఉద్యోగం సంపాదించే వరకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కుటుంబానికి ఏ అవసరం వచ్చినా, ఎలాంటి ఇబ్బంది ఎదురైనా తనకు నేరుగా ఫోన్ చేయాలని సూచిస్తూ వారికి ధైర్యం చెప్పారు.

# నీట్ ( పీజీ ) పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ అమలు

పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు. పరిక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు తో పాటు ట్రాఫిక్ ఆంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పకడ్బంది చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

## ఆప్యాయత అనురాగాలతో రక్షాబంధన్ వేడుకలు





**కల్లూరు ఆగస్టు 28 (జనంసాక్షి)**
అన్నా చెల్లెళ్ల ఆత్మీయ బంధానికి ప్రతీకగా, ఆప్యాయత, ప్రేమానురాగాలకు ఆదర్శంగా నిలిచిన రాఖీ పౌర్ణమి (రక్షాబంధన్) వేడుకలను మండలం లోని ప్రజలు ఆనందోత్సవాలతో, ఉల్లాసంగా శుక్రవారం జరుపుకున్నారు. రాఖీ పౌర్ణమి పురస్కరించు కొని వివిధ రాష్ట్రాలలో సుదూర గ్రామీణ ప్రాంతాలలో స్థిరపడిన తోబుట్టువులు తమ సోదరులకు రాఖీ కట్టేందుకు దుకాణాలలో రాఖీలు స్వీట్లు కొనుగోలు చేసి తమ స్వగ్రామాలకు చేరుకున్నారు. అక్కా చెల్లెళ్లు తమ అన్నా, తమ్ముళ్లకు గంధం పూసి, నుదుట కుంకుమ తిలకం బొట్టు పెట్టి, చేతికి రక్ష కట్టి జీవితాంతం తోబుట్టువులకు అండగా ఉంటూ, సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలని స్వీట్లు తినిపించి ఆశీర్వాదం పొందారు. కల్లూరు పట్టణంలో చిన్నారులు బొల్లం యోగిని , బొల్లం కుషిత, బోల్లం శ్రావణిలు తమ సోదరులు బొల్లం నాగేంద్ర కుమార్, బొల్లం లక్ష్మణరావు,, అవినాష్, మల్లికార్జున్ లకు రాఖీ రక్షాలుకట్టి సీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. సోదరుల ఆశీర్వాదం తీసుకున్నారు. చిన్నారి బొల్లం చైత్ర గౌడ్ తన తమ్ముళ్లు వేదాన్ష , శ్రేయాన్స్ దేవ్, చరణ్ గణేష్ లకు రక్ష రాఖీ కట్టి సంతోషంగా తమ్ముళ్లకు స్వీట్ తినిపించింది. అదేవిధంగా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన చెల్లెళ్లు గాలిబు విజయలక్ష్మి, సమ్మెట సత్యవతి, తమ సొంత గ్రామం పుట్టినిల్లు కల్లూరు చేరుకొని " సోదరులు బొల్లం రామారావు, బొల్లం శంకర్ గౌడ్ లకు హిందూ సాంప్రదాయ ప్రకారం. నుదుట కుంకుమ బొట్టు పెట్టి. రక్షాబంధన్ రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి సోదరుల ఆశీర్వాదం తీసుకున్నారు. తమ తోబుట్టువులు సంపూర్ణ ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని అక్షింతలు వేస్తూ సోదరులు ఆశీర్వదించారు. మండల వ్యాప్తంగా పల్లెల్లో రాఖీ పౌర్ణమి వేడుకలు అత్యంత కోలాహలంగా ఉల్లాసంగా ఉత్సాహభరితంగా జరిగాయి.

## 30న జిల్లా స్థాయి బెంచ్ ప్రెస్ పోటీలు

### పోటీలకు ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్




**కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు 28 (జనంసాక్షి):**
ఈనెల 30వ తేదీన యూనిటీ గోల్డ్స్ జిమ్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని కేటీపీఎస్ కాంప్లెక్స్ లో గల ఇంజనీరింగ్ అసోసియేషన్ హాల్ నందు జిల్లా స్థాయి ఎంకరేజ్ మెంట్ బెంచ్ ప్రెస్ పోటీలను నిర్వహించ నున్నారు,ఈ పోటీలకు ముఖ్య అతిథి గా జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) రోహిత్ రాజ్ హాజరు కాను న్నట్టు యూనిటీ గోల్డ్స్ జిమ్ నిర్వాహకులు ఎం.డి నూర్, ఎండి.జాకీర్, ఎండి.అమీర్ ఖాన్, ఎస్.కె.సల్మాన్ తెలిపారు.శుక్రవారం ప్రెస్ క్లబ్ లో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో పాల్వంచ పట్టణంలో మొట్టమొదటి సారి జిల్లా స్థాయి బెంచ్ ప్రెస్ పోటీలను సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్,మాస్టర్స్ గా మొత్తం 9వెయిట్ కేటగిరీలలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు పోటీలను ప్రారంభించనున్నట్టు,జిల్లా లోని జిమ్ నిర్వాహకులు,క్రీడాకారులు వయస్సు ధృవీకరణ కోసం ఆధార్ కార్డు తీసుకొని ఉదయం 8 గంటల కల్లా ఇంజనీరింగ్ అసోసియేషన్ హాల్ ప్రాంగణానికి చేరుకొని పోటీలు విజయవంతం చేసేందుకు సహకరించాలని కోరారు.

## కిన్నెరసానిలో 29, 30న ఐటీడీఏ ఉద్యోగ, ఉపాధ్యాయుల జిల్లా స్థాయి క్రీడలు..



**కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు28 ( జనంసాక్షి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఆదేశాల మేరకు ఐటీడీఏ పరిధిలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఈ నెల 29, 30 తేదీల్లో పాల్వంచ మండలంలోని కిన్నెరసాని ప్రభుత్వ గిరిజన క్రీడల పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఐటీడీఏ క్రీడల అధికారి బొల్లి గోపాల్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలోతెలిపారు. మూడు అంచెలుగా నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో భాగంగా తొలుత పాఠశాల కాంప్లెక్స్ స్థాయి, అనంతరం డివిజన్ స్థాయి పోటీలు నిర్వహించారు. భద్రాచలం, ఇల్లందు, దమ్మపేట, ఖమ్మం, వైరా డివిజన్లలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఉద్యోగ, ఉపాధ్యాయ క్రీడాకారులతో జిల్లా స్థాయి జట్లను ఎంపిక చేశారు. జిల్లా స్థాయిలో వాలీబాల్, క్రికెట్, చెస్, క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్, 60 మీటర్ల పరుగు, షాట్‌పుట్, టెన్నికాయిట్ తదితర క్రీడాంశాల్లో పురుష, మహిళా ఉద్యోగ, ఉపాధ్యాయులకు పోటీలు నిర్వహించనున్నట్లు గోపాల్‌రావు పేర్కొన్నారు. క్రీడలను ఐటీడీఏ పీఓ బి.రాహుల్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి చందన ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించనున్నారు. ఐదు డివిజన్ల ఏటీడీవోలు, అసిస్టెంట్ స్పోర్ట్స్ అధికారులు పోటీలను పర్యవేక్షించనున్నారు.

## విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో భవిష్యత్ పోరాటాలు

- నాటి పోరాట ఫలితమే ప్రజలకు విద్యుత్ ఛార్జీల భారాలు తగ్గింపు
- సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు



**కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు 28 (జనంసాక్షి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.విద్యుత్ పోరాట అమరవీరుల వర్ధంతి కార్యక్రమం స్తానిక మంచికంటి భవన్లో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు అధ్యక్షతన జరిగింది.ముందుగా అమరవీరుల చిత్ర పటానికి మచ్చా వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఇరవై ఆరు సంవత్సరాల క్రితం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు విధానాలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అమలు చేయడంలో భాగంగా విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చాడని తెలిపారు.చంద్రబాబు నాయుడు ప్రపంచ బ్యాంకు విధానాలను నిరసిస్తూ ఆందోళన పోరాటాలు ప్రతిపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగాయని అన్నారు. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిస్తూ వేలాదిమంది ప్రజలతో హైదరాబాద్ చేరుకోగా కర్కశ చంద్రబాబు ప్రభుత్వం లాఠీచార్జీ చేయడంతోపాటు,శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ప్రజలపై కాల్పులు జరిపించిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కాల్పుల్లో రామకృష్ణ విష్ణువర్ధన్ బాలస్వామిలు మరణించారని అన్నారు. అమరవీరుల పోరాట ఫలితంగా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం వెనక్కు తగ్గిందని నాటినుండి నేటి వరకు ఏ ప్రభుత్వాలు కూడా విద్యుత్ ఛార్జీలు పెంచడానికి సాహసం చేయలేదని ఆయన తెలియజేశారు. ప్రజా పోరాటానికి అంతటి ప్రాధాన్యత ఉంటుందని ఆయన తెలియజేశారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నూతన విద్యుత్ సంస్కరణల చట్టం తీసుకొచ్చి,స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారాలు మోపడానికి సిద్ధమవుతుందని ఈ కుట్రలను విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్ నాయకులు నందిపాటి రమేష్ వై వెంకటేశ్వరరావు ఎలగోండ రఘు వాణి సతీష్ సలీం నాగమణి రసూల్బీ తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ కిడ్జ్ లో ఆనందోత్సవాలతో రక్షాబంధన్

### వెల్లివిరిసిన ఆత్మీయ సోదర,సోదరీమణుల ప్రేమ



**ఖమ్మం ఆగస్టు 28, (జనంసాక్షి) :**
సోదర సోదరీమణుల ఆత్మీయ అనుబంధాలకు ప్రతీకగా నిలిచిన రక్షాబంధన్ వేడుకలను శుక్రవారం స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో ఆనందోత్సవాలతో నిర్వహించారు. ప్రతి తరగతిలో పాఠశాల విద్యార్థులకు బాలికలు రక్షణ కట్టి తమ అనుబంధాన్ని చాటారు. బాలుర ముంజేతికి రక్షాబంధన్ కట్టి, బాలికలు వారికి మిఠాయిలు తినిపించి ఆప్యాయతను చాటారు. విద్యార్థులందరిలో సోదర ప్రేమ వెల్లి విరిసింది. రాఖీలు కడుతున్నంతసేపు బాలుర ముఖాలలో ఆనందం వెల్లివిరిసింది. అదేవిధంగా పాఠశాల పరిసర ప్రాంతాలలోని చెట్లకు విద్యార్థులు రాఖీలు కట్టి తమ వృక్ష బంధాన్ని తెలియజేశారు. దీనితో పాటు పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలకు, వాచ్మెన్, డ్రైవర్స్, తమ ఫోటోలు ఎల్లప్పుడూ తీస్తున్న ఫోటోగ్రాఫర్స్ కు పాఠశాల విద్యార్థులు రాఖీలు కట్టడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ "విద్యార్థులలో సహోదర ప్రేమ విలువను తెలియజేసేందుకు రక్షాబంధన్ వేడుకలను పాఠశాలలో నిర్వహిస్తున్నామని తెలియజేశారు. అన్నాచెల్లెళ్ల అనుబంధం?జీవితాంతం నిలిచే ఒక మధురమైన బంధం



చేతికి కట్టే రాఖీ ఒక దారం మాత్రమే కాదు?ప్రేమకు, నమ్మకానికి, ఆప్యాయతకు ప్రతీకఅని,పురాణాల కాలం నుండి ప్రత్యేకంగా మన దేశంలోని అన్ని ప్రాంతాలలో రక్షాబంధన్ వేడుకలకు మహోన్నత స్థానం ఉందని పేర్కొన్నారు. తోడబుట్టిన సోదరులకే కాకుండా ఇతరులను సోదరులుగా భావించి రాఖీలు కట్టే సంప్రదాయం మనదేశానికే సొంతం అని తెలియజేశారు. రాఖీ పర్వదినం ప్రజలందరిలో అనురాగ ఆప్యాయతలను, ఐకమత్యాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు." ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## బాలికల రక్షణతోనే బంగారు భవిష్యత్తు

### రక్షాబంధన్‌తో భద్రత, విద్య, సమానత్వంపై అవగాహన



**ఖమ్మం, ఆగస్టు 28 (జనంసాక్షి)**
బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాలల రక్షణ, బాలికల విద్య, సాధికారత, సమానత్వంపై అవగాహన కల్పించేందుకు ఖమ్మం జిల్లాలో రక్షాబంధన్ కార్యక్రమాలను నిర్వహించారు.జిల్లా సంక్షేమాధికారి ఆలివేటి ప్రమీల ఆధ్వర్యంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం టప్త్రవలి సిబ్బంది ఎస్.డి. సమ్రీన్, పి. ప్రమీల, ఆర్. వసంతి,సతీష్ చిల్డ్రన్ హోమ్ సూపరింటెండెంట్ నవ్య చిల్డ్రన్ హోమ్ సిబ్బంది తో కలిసి చిల్డ్రన్ హోమ్‌లోని పిల్లలతో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు ఉత్సాహంగా పాల్గొని రాఖీలు కట్టుకున్నారు. ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం, రక్షణ సందేశాన్ని చాటారు.ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి మాట్లాడుతూ బాలికలను రక్షించడంతో పాటు వారికి నాణ్యమైన విద్య అందించి, అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. రక్షాబంధన్‌ను అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా మాత్రమే కాకుండా, ప్రతి బాలికకు రక్షణ, గౌరవం, విద్య, సమాన హక్కులు కల్పించాలనే సామాజిక బాధ్యతకు ప్రతీకగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా బుర్హాన్‌పురం అంగన్వాడీ కేంద్రంలోనూ రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.



సందర్భంగా బాలికల రక్షణ, విద్య, సమానత్వం, హక్కులు, భద్రతపై అవగాహన కల్పించారు.

# విస్తా కాంప్లెక్సుకు విద్యుత్తు నిలిపివేసిన దేవస్థానం అధికారులు

## దిక్కుతోచక ఖాళీ చేస్తున్న వ్యాపారులు



భద్రాచలం ఆగస్టు 28 (జనంసాక్షి)
ఉదయం వరకు తమ జీవనాధారంగా ఉన్న దుకాణాలు.. సాయంత్రానికి ఖాళీ గదులుగా మారాయి. ఏళ్ల తరబడి అద్దెలు చెల్లిస్తూ వ్యాపారం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకున్న వ్యాపారులు.. చేతిలో సామాన్లు పట్టుకుని రోడ్డుపై నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. భద్రాచలం విస్తా కాంప్లెక్స్ లో జరిగిన పరిణామాలు వ్యాపారుల్లో తీవ్ర ఆవేదన నింపాయి. రామాలయ అభివృద్ధి పనుల్లో భాగంగా భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంకు చెందిన విస్తాకాంప్లెక్సును కూల్చివేయనున్నారు. వీరికి ఇప్పటికే దేవస్థానం అధికారులు ఈ నెల 16 వరకు గడువు ఇచ్చి ఖాళీ చేయాలని పేర్కొన్నారు. కాని వినాయక చవితి వరకు సమయం కావాలని కోరారు. దేవస్థానం అధికారులు ఇటీవల వ్యాపారులతో జరిగిన చర్చల్లో సానుకూలంగా ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు అంగీకరించకపోవడంతో తక్షణమే దుకాణాలను ఖాళీ చేయాలని చెప్పారు. అయినప్పటికీ వ్యాపారులు ముందుకు రావడంతో గురువారం రాత్రి నుంచి ఈ కాంప్లెక్సుకు ఉన్న విద్యుత్తు సరఫరాను పూర్తిగా నిలిపివేసారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో విస్తాకాంప్లెక్సు వ్యాపారులు తమ దుకాణాలను ఖాళీ చేస్తున్నారు. దుకాణాల్లోని సరుకులు, ఫర్నిచర్, ఇతర సామగ్రిని బయటకు తీసుకువస్తున్న దృశ్యాలు కంటతడి పెట్టిస్తున్నాయి. కొందరు వ్యాపారులు తమ సామాన్లను వాహనాల్లో తరలిస్తుండగా.. మరికొందరు వాటిని ఎక్కడ భద్రపరచాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. ఎన్నేళ్లుగా వ్యాపారం సాగిన ప్రదేశాన్ని వదిలి వెళ్లాల్సి రావడంతో భావోద్వేగానికి గురవుతున్నారు. ఏళ్ల తరబడి దేవస్థానానికి అద్దెలు చెల్లిస్తూ వ్యాపారం నిర్వహించామని, భక్తులకు అవసరమైన సేవలు అందించామని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఇప్పుడు ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుండా ఖాళీ చేయించడం తమ కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని వాపోతున్నారు.

**- వ్యాపారం పోయింది.. కుటుంబం ఎలా?**

చిన్న వ్యాపారుల వెనుక వారి కుటుంబాల జీవనం ముడిపడి ఉంటుంది. దుకాణం మూతపడితే కేవలం ఒక వ్యక్తి ఆదాయం మాత్రమే కాదు.. ఇంట్లో పిల్లల చదువులు, కుటుంబ ఖర్చులు, అప్పుల చెల్లింపులు అన్నీ ప్రశ్నార్థకమవుతాయి. విస్తా కాంప్లెక్స్ లోని వ్యాపారుల పరిస్థితి కూడా ఇప్పుడు అదే ఆందోళనను కలిగిస్తోంది. తమ పరిస్థితిని అధికారులు మానవీయ కోణంలో పరిశీలించాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేదా తగిన గడువు కల్పించాలని వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఒక్కసారిగా తమ జీవనాధారాన్ని కోల్పోయే పరిస్థితి నుంచి కాపాడాలని కోరుతున్నారు. "మా షాపులు మాత్రమే కాదు.. మా కుటుంబాల బతుకులు కూడా ఇక్కడే ఉన్నాయి. మమ్మల్ని రోడ్డున పడేయకుండా న్యాయం చేయాలి" అని కన్నీటితో వేడుకుంటున్నారు.

## 22ఏ భూముల సమస్యలపై కలెక్టర్ కీలక ఆదేశాలు

తొలగింపు ప్రక్రియలోనూ పాటించాలని సూచించారు. తొలగించే ప్రతి సర్వే నంబర్‌కు నిర్దిష్ట కారణాలు, స్పష్టమైన రిమార్క్స్ తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 22ఏ సమస్యలను పారదర్శకంగా, వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. అదే సమయంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. 22ఏ భూములకు సంబంధించిన ఫిర్యాదులపై అధికారులు సమన్వయంతో పనిచేసి, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే నిర్ణయాలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లాలోని మండల తహశీల్దార్లు, నాయబ్ తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## దత్తప్పగూడెంలో తాగునీటి కష్టాలు

### రోజుల తరబడి నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజల అవస్థలు



**మోత్కూరు ఆగస్టు 28 (జనంసాక్షి)**
దత్తప్పగూడెం గ్రామంలోని కొత్తగూడెం ప్రాంతంతో పాటు మెయిన్ రోడ్డు ఇరువైపులా నివసిస్తున్న ప్రజలు తీవ్ర తాగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు తాగునీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. తాగునీటి సమస్యను పలుమార్లు సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించకపోవడంపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి సరఫరాపై వాటర్‌మెన్‌ను ప్రశ్నించిన సమయంలో ప్రజలతో దురుసుగా మాట్లాడుతున్నారనే ఫిర్యాదులు కూడా వస్తున్నాయి. ఈ సమస్యపై గ్రామ సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లి గ్రామస్థుల తరఫున వినతిపత్రం అందజేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సర్పంచ్, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. అంతేకాకుండా తరచూ తలెత్తుతున్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి, ప్రజలకు నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత అని, సమస్యను వెంటనే పరిష్కరించాలని దత్తప్పగూడెం గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సంతోషిమాత దేవాలయంలో ఘనంగా జరిగిన సంతోషిమాత అమ్మవారి జన్మదిన వేడుకలు, రాఖీ పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు



## అక్రమంగా పశువుల తరలింపు అడ్డుకున్న పోలీసులు

### 13 పశువులు స్వాధీనం.. ఇద్దరు అదుపులో






**భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 28 (జనంసాక్షి):**
యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అక్రమ పశు రవాణాపై చేపడుతున్న ప్రత్యేక నిఘాలో భాగంగా పిల్లాయిపల్లి లో 13 పశువులను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం భూదాన్ పోచంపల్లి మండలంలోని పిల్లాయిపల్లి గ్రామ శివార్లలో ఎస్ఐ జె. జగన్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ39డబ్ల్యూపీ8138 నంబర్ గల అశోక్ లేలాండ్ వాహనాన్ని తనిఖీ చేయగా, ఎలాంటి అనుమతులు లేకుండా 10 మగ దూడలు, 3 ఆడ దూడలను తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహన డ్రైవర్ పిసర్ల జోసెఫ్ (30), అంగులూరి అశోక్ (26)లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న పశువులను రంగారెడ్డి జిల్లా జాఫర్‌గూడలోని శ్రీ ప్రత్యంగిర గోశాలకు తరలించారు. సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## ఘనంగా రక్షాబంధన్ వేడుకలు





తుంగతుర్తి ఆగస్టు 28 (జనం సాక్షి) మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం రక్షాబంధన్ కార్యక్రమాన్ని ప్రజలు ఆనందోత్సవాల మధ్య ఘనంగా నిర్వహించారు, అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమను ప్రతిబింబించే ఈ పండుగ గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది, ఈ సందర్భంగా దూర ప్రాంతాల నుండి అక్కా చెల్లెళ్లు తమ సోదరులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు, రాఖీ కొనుగోళ్లకు వచ్చిన మహిళలతో రాఖీ విక్రయ కేంద్రాల తో పాటు మిఠాయి దుకాణాలు వద్ద సందడి నెలకొంది, రాఖీ కట్టిన సోదరీమణులకు సోదరులు కానుకలు అందించారు, ఈ సందర్భంగా జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ గుజ్జ దీపికా యుగంధర్ రావు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డికి ఆయన సోదరి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

## పైసలు ఇస్తేనే విద్యుత్ లైన్ కనెక్షన్!



- **రెండేళ్లుగా నిరుపయోగంగా విద్యుత్ స్తంభం**
- **గుంజపై ప్రమాదకరంగా విద్యుత్ తీగలు..**
- **పట్టించుకోని ఏఈ : ప్రధానమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు**

**మాడుగులపల్లి, ఆగస్టు 28 (జనంసాక్షి):**
స్థానిక విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం, అవినీతి ప్రజల ప్రాణాల మీదకు తెస్తోందని మాడుగులపల్లి మండల కేంద్రంలోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో రెండేళ్ల క్రితం విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసినప్పటికీ, నేటికీ దానికి విద్యుత్ లైన్ అనుసంధానం చేయకపోవడం విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండేళ్ల క్రితం విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. అయితే దానికి విద్యుత్ లైన్ అనుసంధానం చేయకుండా, స్తంభానికి బదులుగా తాత్కాలికంగా గుంజను ఏర్పాటు చేసి, దానిపై నుంచి విద్యుత్ తీగలను ప్రమాదకరంగా తీసుకెళ్లారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే ఆ విద్యుత్ తీగల కారణంగా పలుమార్లు చిన్నపాటి ప్రమాదాలు చోటుచేసుకున్నాయని వారు తెలిపారు.ఈ విషయంపై స్థానిక విద్యుత్ శాఖ సహాయ ఇంజినీర్‌కు పలుమార్లు విన్నవించినప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోయిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నేరుగా లంచం డిమాండ్ చేస్తున్నారని, డబ్బులు ఇస్తేనే విద్యుత్ లైన్ కలుపుతామని చెబుతున్నారని వారు ఆరోపిస్తున్నారు.ప్రాణాపాయంగా మారిన ఈ సమస్యపై స్థానిక అధికారులు స్పందించకపోవడంతో బాధితులు నేరుగా ప్రధానమంత్రి కార్యాలయానికి ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తక్షణమే విద్యుత్ స్తంభానికి లైన్ అనుసంధానం చేసి ప్రమాదాన్ని నివారించాలని, లంచం డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాడుగులపల్లి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఆదివాసీ సంస్కృతికి సజీవ సాక్ష్యం గిరిజన మ్యూజియం

## - ఏలూరు జిల్లా పెళ్లి బృందం ప్రశంసలు



**భద్రాచలం ఆగస్టు 28 (జనంసాక్షి)**

భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ట్రైబల్ మ్యూజియం అద్భుతంగా ఉందని ఛత్తీస్ గఢ్ కు చెందిన రిటైర్డ్ ఎస్ ఎస్ సీఎల్ సర్వే డిపార్ట్ మెంట్ సూపర్ వైజర్ హరిలాల్ సింగ్ , ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలానికి చెందిన పెళ్లి బృందం సభ్యులు ప్రశంసించారు. శుక్రవారం వారు ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియంను సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన వివిధ కళాఖండాలను ఆసక్తిగా తిలకించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి సన్నిధిలో వివాహ కార్యక్రమం నిర్వహించి స్వామివారి దర్శనం అనంతరం ట్రైబల్ మ్యూజియం గురించి తెలుసుకుని సందర్శించేందుకు వచ్చినట్లు వారు తెలిపారు. మ్యూజియం ప్రవేశ ద్వారం నుంచే గిరిజన కళా సంస్కృతిని ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన అలంకరణలు ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. మ్యూజియం ఆవరణలో గిరిజన తెగల సంస్కృతి, జీవన విధానాలకు అనుగుణంగా నిర్మించిన పురాతన గృహాల నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయని అన్నారు. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం, యువత కోసం బాక్స్ క్రికెట్ వంటి సౌకర్యాలు బాగున్నాయని కొనియాడారు. మ్యూజియం నిర్వహణ, సిబ్బంది అందిస్తున్న సమాచారం, అక్కడ ప్రదర్శించిన కళాఖండాలు తమను విశేషంగా ఆకట్టుకున్నాయని వారు పేర్కొన్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు పరిచయం చేసేలా అద్భుతమైన మ్యూజియాన్ని ఏర్పాటు చేసిన ఐటీడీఏ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మ్యూజియం ఇన్ చార్జి ప్రభాకర్ రావు, మాధవి, సలీం తదితరులు పాల్గొన్నారు.



# శివన్నగూడెంలో చోరీ కలకలం..

**○తాళం పగలగొట్టి దోచుకెళ్లిన దొంగలు**

**○3 తులాల బంగారు చైన్, 12 తులాల వెండి పట్టాలు, రూ.11 వేల నగదు అపహరణ**

**మర్రిగూడ, ఆగస్టు 28 (జనంసాక్షి)**

ఇంటికి తాళం వేసి కుమార్తె వద్దకు హైదరాబాద్‌కు వెళ్లిన ఓ కుటుంబం ఇంట్లో చోరీ జరిగిన ఘటన మర్రిగూడ మండలం శివన్నగూడెం గ్రామంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది.


గ్రామానికి చెందిన చిలుకూరి యాదయ్య, అతని భార్య వెంకటమ్మ ఈ నెల 25న తమ కుమార్తె రజితను కలిసేందుకు హైదరాబాద్‌కు వెళ్లారు. కాగా, శుక్రవారం ఉదయం యాదయ్య ఇంటి పక్కనే నివసించే మంచికంటి రేణుక ఫోన్ చేసి ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో పాటు తాళం పగలగొట్టి ఉందని సమాచారం అందించారు.

దీంతో యాదయ్య వెంటనే శివన్నగూడెంలోని తన ఇంటికి చేరుకుని పరిశీలించగా, ఇంటి తాళం పగలగొట్టి తలుపులు తెరిచి ఉన్నట్లు గుర్తించారు. ఇంట్లోని బీరువాను పరిశీలించగా అందులో ఉంచిన 3 తులాల బంగారు చైన్, 12 తులాల వెండి పట్టాలు, రూ.11,000 నగదు కనిపించలేదు.

గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించి బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించుకెళ్లినట్లు యాదయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చోరీకి పాల్పడిన వ్యక్తుల ఆచూకీ కోసం పోలీసులు విచారణ చేపట్టారు.

## తుంగగూడెం ఇసుక రీచ్ను వెంటనే ప్రారంభించాలని

## అర్వపల్లి వై జంక్షన్ లో ట్రాక్టర్ యజమానుల నిరసన



జాజిరెడ్డిగూడెం మండల **ఆగస్టు 28 (జనంసాక్షి) :** జాజిరెడ్డి గూడెం శివారులోని మూసీ నదిలో తుంగగూడెం ఇసుక రీచ్ ని వెంటనే తెరిచి మన ఇసుక మన వాహనం ఇసుక బుకింగ్ లను ప్రారంభించాలని కోరుతూ శుక్రవారం అర్వపల్లిలో 365 బి హైవేపై ట్రాక్టర్ యజమానుల సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రాక్టర్ యజమానుల సంఘం అధ్యక్షుడు వల్లాల కోటి, ట్రాక్టర్ యజమానులు పాల్గొన్నారు.



# విద్యుత్ అమరవీరుల పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తాం

**ఖమ్మం కార్పొరేషన్ , ఆగస్ట్ 28( జనంసాక్షి)**

బషీర్ బాగ్ విద్యుత్ పోరాటంలో అసువులు బాసిన విద్యుత్ అమరవీరులకు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. 2000 సం.లో విద్యుత్ ఛార్జీల వ్యతిరేక ప్రదర్శన సందర్భంగా బషీర్ బాగ్ వద్ద పోలీసులు జరిపిన కాల్పుల్లో అసువులు బాసిన అమరవీరులకు వారి 26వ, వర్ధంతి సందర్భంగా సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్ అధ్యక్షతన రామకృష్ణ స్థూపం వద్ద జరిగిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ (ఎం. ఎల్.) మాస్లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సి.వై. పుల్లయ్య మాట్లాడుతూ, ఆనాడు చంద్రబాబు నాయుడు విద్యుత్ రంగంలో సంస్కరణలు తీసుకురావటానికి ప్రయత్నిస్తే విద్యుత్ రంగం ప్రభుత్వ రంగంలోనే ఉండాలి, ప్రైవేటీకరించొద్దని డిమాండ్ చేస్తూ ఆనాడు 9 వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో విద్యుత్ పోరాటం చేశామన్నారు. ఆనాటి పోరాటం, విద్యుత్ అమరవీరుల త్యాగాల వల్ల రైతులకు ఉచిత విద్యుత్, పేదలకు క్రాస్ సబ్సిడీని పాలకులు ఇస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల జాబితాలోని విద్యుత్ను లాగేసుకొని సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. జి.ఎస్.టి.తో రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిమీద దెబ్బ కొట్టారని వారు విమర్శించారు. 26 ఏండ్లు గడుస్తున్నా ఆనాటి విద్యుత్ పోరాట దృశ్యాలు కండ్ల ముందే మెదలాడుతున్నాయని అన్నారు. ఆనాటి ఘటన యాదృచ్ఛికమైనది కాదని, ప్రభుత్వ విధానాలకు సంబంధించినదని చెప్పారు. పాలకుల విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు తిరగబడక తప్పదని హెచ్చరించారు. నేడు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు ముందుకు వచ్చే అవకాశం ఉందన్నారు. సంస్కరణలు, ఆర్థిక విధానాలు, మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజల పక్షాన పోరాడాల్సిన బాధ్యత వామపక్ష పార్టీలపై ఉందని, విద్యుత్ అమరవీరుల సాక్షిగా ఆ బాధ్యతను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. విద్యుత్ పోరాటం, ముగ్గురు అమరవీరుల త్యాగాల వల్లే నేటికి కూడా విద్యుత్ ఛార్జీలు పెంచాలంటే పాలకులు భయపడుతున్నారని వారు తెలిపారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ సంస్కరణల వల్ల ప్రజలపై భారం పడుతోందని అన్నారు. మోడీ ఆర్డినెన్స్ తెచ్చి స్మార్ట్ మీటర్లు దేశంలో, రాష్ట్రంలో ఏర్పాటుచేసి కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చాలని చూస్తున్నారని, దానిని ప్రజలంతా తిప్పికొడుతూ పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా నాయకులు జానీమియా, శింగు నర్సింహారావు, సిపిఎం సీనియర్ నాయకులు పోన్నం వెంకటేశ్వరరావు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావుజిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు,భుక్యా వీరభద్రం,మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు, బండి పద్మ, మెరుగు సత్యనారాయణ సిపిఐ జిల్లా నాయకులు పోటు కళావతి, మేకల శ్రీనివాస్, సిహెచ్. సీతామహాలక్ష్మి, సిపిఐ (ఎం.ఎల్.) మాస్లైన్ జిల్లా నాయకులు ఆవుల అశోక్, రామయ్య, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

### భద్రాచలంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల

# విస్తృత తనిఖీలు

**భద్రాచలం ఆగస్టు 28 (జనంసాక్షి)**

ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా భద్రాచలం పట్టణంలో శుక్రవారం ఆహార భద్రతా శాఖ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఆహార భద్రత అధికారి ఈ. శరత్ ఆధ్వర్యంలో ఫుడ్ సేఫ్టీ సిబ్బంది బిట్టా ప్రవీణ్ కుమార్, ఫుడ్ సేఫ్టీ బృందంతో కలిసి ఈ తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో భాగంగా పట్టణంలోని 15 కిరాణా దుకాణాలను అధికారులు అకస్మాత్తుగా పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణాల్లో ఉన్న ఆహార పదార్థాల నాణ్యతను, ప్యాకింగ్ తేదీలను తనిఖీ చేయడంతో పాటు, సేకరించిన నమూనాలను రసాయనాలు, నిషేధిత కృత్రిమ రంగులు ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. అలాగే ప్యాకింగ్ పై ఎలాంటి లేబుళ్లు, తయారీదారు వివరాలు, ఎక్కడి నుండి సరఫరా అవుతున్నాయనే సరైన సమాచారం లేకపోవడంపై అధికారులు గుర్తించారు. నిబంధనలు పాటించని వ్యాపారులకు నోటీసులు జారీ చేయడంతో వ్యాపారుల వద్ద సేకరించిన నమూనాలను ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు.

### భద్రాద్రి రామాలయంలో ముగిసిన పవిత్రోత్సవాలు

## నేటి నుంచి నిత్యకల్యాణాల పునరుద్ధరణ

**భద్రాచలం ఆగస్టు 28 (జనంసాక్షి)**

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. పవిత్రోత్సవాలకు ఉద్వాసన పూర్ణాతిని వైదిక బృందం నిర్వహించారు. పవిత్రోత్సవాలకు ఆదివారం అంకురార్పణ నిర్వహించగా, సోమవారం పవిత్రాదివాసం, మంగళవారం పవిత్రారోపణం, బుధ, గురువారాల్లో హోమాలు, వేద పారాయణం నిర్వహించారు. శుక్రవారం పవిత్రోత్సవాలకు ఉద్వాసనం పలికే వైదిక కార్యక్రమం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పవిత్రోత్సవాలు ముగియడంతో శనివారం నుంచి శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణాలను పునరుద్ధరించనున్నారు.

## వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించిన మల్లిబాబు యాదవ్



**కామేపల్లి,ఆగస్టు 28 (జనంసాక్షి):**

మండలంలోని పండితాపురం గ్రామానికి చెందిన బత్తుల రాంబాబు–ఉపేంద్ర దంపతుల కుమారుడు నరసింహారావు, ఖమ్మం నగరానికి చెందిన వల్లెపు దుర్గాప్రసాద్–శివాని దంపతుల కుమార్తె హరిణి ల వివాహ వేడుక స్థానిక శ్రీనివాస కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వధూవరులు కలకాలం అన్యోన్యంగా,సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల జాప్యం గురించి మల్లిబాబు యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా దీనిపై స్పందిచిన ఆయన రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల విషయంలో కావాలనే జాప్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. అయినప్పటికీ, ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే లబ్ధిదారులకు బిల్లులు చెల్లించడానికి సిద్ధంగా ఉందన్నారు. అలాగే త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇండ్లను కూడా మంజూరు చేయనున్నట్లు స్పష్టం చేశారు.?ఈ కార్యక్రమంలో కొమ్మినేపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ ధరావత్ అనురాధ, ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పాటిబండ్ల ప్రసాద్, నాయకులు చల్లా రాజు,బత్తుల వీరబాబు,మొగిలి శ్రీను,చల్లా మల్లయ్య,మంజల సాంబయ్య,గుండ్ల ఏసోబు,కుటుంబ సభ్యులు బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# చింతకాని మండలంలో పర్యటించిన మాజీ ఎంపీ నామ

## నూతన వధూవరులకు నామ ఆశీస్సులు

**చింతకాని, ఆగష్టు 28 (జనంసాక్షి)**
బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు శుక్రవారం చింతకాని మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా నేరేడ గ్రామ వాస్తవ్యులు నన్నక కోటయ్య కుమారుడు రవితేజ వివాహం బోనకల్ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ముత్తం శ్రీనివాసరావు?శిరీష దంపతుల కుమార్తె సింధుతో గురువారం ఉదయం జరిగిన నేపథ్యంలో, నూతన వధూవరుల స్వగృహంలో శుక్రవారం నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమంలో నామ పాల్గొన్నారు. స్వామివారి ప్రసాదం స్వీకరించి నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం వారికి వస్త్రాలను బహూకరించారు.

**నామకు రాఖీలు కట్టిన మహిళలు**
అనంతరం ఆ గ్రామంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన పలువురు మహిళలు రాఖీ పండుగ సందర్భంగా నామ నాగేశ్వరరావుకు రాఖీలు కట్టి శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనకు స్వీట్ తినిపించి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా నామ నాగేశ్వరరావుతో స్థానికులు ఉత్సాహంగా ఫొటోలు దిగారు.

**గురిజాల హనుమంతరావును పరామర్శించిన నామ**
అంతకుముందు చింతకాని మాజీ వైస్ ఎంపీపీ గురిజాల హనుమంత రావు ఇటీవల చిన్న శస్త్రచికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న నామ నాగేశ్వరరావు ఆయన నివాసా నికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో బాణాల వెంకటేశ్వర్లు, మోరంపూడి ప్రసాదరావు, మంకెన రమేష్, వంకాయలపాటి లచ్చయ్య, తన్నీరు రవి, బొడ్డు వెంకటరామయ్య, గడ్డం శ్రీనివాసరావు, చాట్ల సురేష్, పోట్ల సీతయ్య, చెవుల ప్రసాద్, సోమా నాగేశ్వరరావు, సామినేని అప్పారావు, తుమ్మలపల్లి శ్రీనివాసరావు, పాల్నిడి కొండలరావు, సరిపూడి గోపి సందేశ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.







సూర్యాపేటలో...రక్షాబంధన్ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డికి రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపిన మహిళలు..

## ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

**హాలియా జనం సాక్షి ఆగస్టు 28**
అనుముల మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. హాలియా మున్సిపాలిటీలో అన్నా చెల్లెల అనుబంధానికి ప్రతీక అక్క తమ్ముళ్ల అనురాగ బంధానికి రక్షాబంధన్ ఉదయం నుండి ఆడపడుచులు హాలియాలో రాఖీలు మిఠాయిలు తీసుకొని పుట్టింటికి వెళ్లి తన సోదరులకు నుదుట తిలకం దిద్ది రాఖీ కట్టి మిఠాయిలు తినిపించి సోదరులు ఇచ్చిన కానుకలు తీసుకొని రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలుపుతూ ఆనందంగా ఆప్యాయం గా కుటుంబ సభ్యులతో కబుర్లు చెప్పుతూ సరదాగా గడిపారు.



## ఆనందోత్సాహాల మధ్య రక్షాబంధన్

**వలిగొండ,ఆగస్టు 28 (జనం సాక్షి )**
మండలంలోనిచిన్నారులు రక్షాబంధన్ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఒకరికొకరు రాఖీలు కట్టుకుని మిఠాయిలు తినిపించుకుంటూ పండుగను ఘనంగా నిర్వహించారు. చిన్నతనం నుంచి సాంప్రదాయాలు, సంస్కృతిని అలవర్చుకోవడం ద్వారా పిల్లల్లో క్రమశిక్షణ, మర్యాద ,కుటుంబ విలువ పెంపొందుతాయని తల్లిదండ్రులు అన్నారు.



## అనురాగానికి ఆత్మీయతకు ప్రతీక రక్షక బంధన్

**కనగల్లు, ఆగస్టు 28 (జనంసాక్షి)**
అన్న చెల్లెలు, అక్క తమ్ముళ్ల అనుబంధానికి ప్రత్యేకగా నిలిచే రక్షకబంధన్ వేడుకలు ప్రేమ అనురాగం ఆప్యాయతల మధ్య ఘనంగా జరిగాయి. రక్త సంబంధానికి ఆత్మీయ అనుబంధానికి నిలువెత్తు రూపం రాఖీ బంధమని, సోదరి కంటే రాఖీ దారంతో సోదరుడి క్షేమాన్ని కోరే పవిత్ర బంధం గాను, ఆమె కష్టసుఖాల లో అండగా నిలుస్తాడని నమ్మకం, బాధ్యత సోదరుడిపై ఉంటుందని, తోడబుట్టిన వారి బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని పలువురు పేర్కొన్నారు. రాఖీ పండుగ రోజు న స్వీట్ల దుకాణాలు, తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రాఖీ దుకాణాలు ఆడబిడ్డలతో సందడిగా మారాయి. రాఖీ కట్టిన అనంతరం చిన్ననాటి స్నేహ జ్ఞాపకాలను గుర్తు చేసుకుని, స్వీట్లు ఒకరికొకరు పంచుకున్నారు.



### సన్న వరి బోనస్ గడువు సెప్టెంబర్ 10 వరకు పొడిగింపు

## రైతులు సద్వినియోగం చేసుకోవాలి

### గుర్రంపోడు మండల వ్యవసాయ అధికారి మాధవరెడ్డి

**గుర్రంపోడు ఆగస్టు 28, (జనంసాక్షి)**
వానాకాలం సీజన్‌లో సన్న వరి సాగు చేసిన రైతులకు ప్రభుత్వం అందించే క్వింటాలుకు రూ.500 అదనపు ప్రోత్సాహక (బోనస్) దరఖాస్తు గడువును వచ్చే నెల సెప్టెంబరు 10వ తేదీ వరకు పొడిగించినట్లు గుర్రంపోడు మండల వ్యవసాయ అధికారి మాధవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అధికారికంగా గుర్తించిన 7 రకాల సన్న వరి వంగడాలను (బీపీటీ-5204, కేఎన్ఎమ్-1638, ఆర్ఎన్ఆర్-15048, హెచ్ఎంటీ సోనా, కేఎన్ఎమ్-7715, జైశ్రీరామ్, డబ్ల్యూజీఎల్-44) సాగు చేసిన రైతులకు మాత్రమే ఈ బోనస్ లబ్ధి చేకూరుతుందని ఆయన స్పష్టం చేశారు.సన్న రకాలు పండించిన రైతులు తాము ధాన్యం విక్రయించే సమయంలో కొనుగోలు కేంద్రాలు లేదా మిల్లుల వద్ద తప్పనిసరిగా తమ వివరాలను నమోదు చేసుకుని, గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. సొంతంగా సన్న వరి సాగు చేసిన రైతులు వెంటనే తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారిని కలిసి తమ పేరు, పంట వివరాలను ఖచ్చితంగా నమోదు చేసుకోవాలని కోరారు.మండలంలో ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డిజిటల్ పంట సర్వే (ఆన్‌లైన్ పంట వివరాల నమోదు) కార్యక్రమానికి రైతులందరూ పూర్తిస్థాయిలో సహకరించాలని వ్యవసాయ అధికారి మాధవరెడ్డి విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయి పరిశీలన కోసం వచ్చే సర్వే సిబ్బందికి తమ సాగు వివరాలను అందించి, భూమి వారీగా పంట వివరాలను ఖచ్చితంగా నమోదు చేయించుకోవాలన్నారు.ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం వల్ల వానాకాలం సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే ముప్పు ఉందని,ఈ నేపథ్యంలో నీటి లభ్యత తక్కువగా ఉన్న రైతులు వరి సాగుకు ప్రత్యామ్నాయంగా, తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేసుకోవడం ఉత్తమమని ఆయన రైతులకు సూచించారు.



## ఈ నెల 30న తుంగతుర్తిలో ఉచిత కంటి వైద్య శిబిరం

**తుంగతుర్తి ఆగస్టు 28 (జనం సాక్షి)**
స్వర్గీయ సంకినే రామారావు కమలమ్మ జ్ఞాపకార్థం ఈనెల 30న మండల కేంద్రంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బిజెపి రాష్ట్ర నాయకులు సంకినేని రవీందర్ రావు గ్రామ సర్పంచ్ మల్లెపాక సాయిబాబా తెలిపారు, శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అక్షర ఫౌండేషన్ సూర్యాపేట, శంకర కంటి ఆస్పత్రి ? హైదరాబాద్ ఆధ్వర్యంలో, ఎస్.కె.ఆర్. కన్స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ మేరకు కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తుంగతుర్తి మరియు పరిసర ప్రాంతాల ప్రజలకు కంటి వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శంకర కంటి ఆస్పత్రి, హైదరాబాద్ వైద్య నిపుణులచే శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించబడతాయని చెప్పారు.కంటి సమస్యలు ఉన్నవారిని పరీక్షించి, ఆపరేషన్ అవసరమైన అర్హులైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేపించబడునని తెలిపారు. శిబిరానికి వచ్చే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు.ఈ ఉచిత వైద్య శిబిరం ఉదయం 9:00 గంటలకు, తుంగతుర్తి రామాలయం గుడి దగ్గర ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల భవన్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.తుంగతుర్తి గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు



## ద్విచక్ర వాహనదారులకు రాఖీ కట్టి హెల్మెట్ అందజేత

**నేరేడుచర్ల ఆగస్టు 28( జనంసాక్షి):**
ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లు ధరించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగి నప్పుడు ఎంతో మంది మరణిస్తున్నారని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని ఎస్ఐ గోపాల్ రెడ్డి అన్నారు. రాపోలు నవీన్ ఆధ్వర్యంలో రాఖీ పండుగ సందర్భంగా 10 మంది ద్విచక్ర వాహన దారులకు చిన్న పిల్లలతో గులాబీ పువ్వు ఇచ్చి స్వీట్ తినిపించి రాఖి కట్టి హెల్మెట్ బహుమతిగా అందజేశారు.ఎస్ఐ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో ప్రతిరోజూ 400 మందికి పైగా రైడర్లు రోడ్డపై మరణిస్తున్నారు, రోడ్లు భద్రతను ప్రోత్సహించడానికి రాఖి సంప్రదాయాన్ని తిరిగి వ్రాయాల్సిన సమయం ఆసన్నమైంది అంటూ, హెల్మెట్ లేనిన ప్రయాణం ప్రాణంతో ఆటలాడడమే అని నా అన్న /తమ్ముడు సురక్షితంగా ఉంటేనే రాఖీకి అర్థం ఉంటుంది సాటి చెప్పిన పిల్లలకి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో దూళిపాళ ధనుంజయ నాయుడు, పెరుమాళ్ళ సతీష్ కుమార్, రామ్ సైదులు ,తకెళ్ళ నాగార్జున, షేక్ నాగుల్ మీరా, చిలకరాజు శ్రీను,అరె శ్రీకాంత్ ,రమేష్ ,నాగరాజు, కర్రీ సతీష్ రెడ్డి, కొప్పు గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

